
సాక్షి
వికారాబాద్
బుధవారం । 17 । జూలై । 2024



విస్తరణ.. జరిగేనా?
హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై నిత్యం రద్దీతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. 8లో▸



బ్రిడ్జి నిర్మాణంపై అభ్యంతరం
పాత తాండూరు రైల్వే బ్రిడ్జి నిర్మాణంపై మంగళవారం నిర్వహించిన సమావేశం వివాదాస్పదంగా మారింది. 8లో▸



పొంచి ఉన్న రోగాల ముప్పు
పట్టణాల్లో పారిశుద్ధ్యం లోపించడం తోపాటు, వర్షాలు పడుతుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. 9లో▸



పోటీ పరీక్షలకు సిద్ధం కావడమంటే అంత ఆషామాషీ కాదు.. అంతకు మించి కష్టపడితే తప్ప పరీక్ష కేంద్రాలకు చేరుకోలేని పరిస్థితి డీఎస్సీ అభ్యర్థులది. 400కిలో మీటర్లు ప్రయాణం చేసి.. రెండు మూడు జిల్లాలు దాటితే కానీ గమ్యం చేరుకోలేని పరిస్థితి.

అగ్ని పరీక్ష

డీఎస్సీ అభ్యర్థులకు సుదూర ప్రాంతాల్లో ఎగ్జామ్ సెంటర్ల కేటాయింపు

- రాకపోకలకే 18 గంటల సమయం
- ఒక్కరోజు ముందుగా బయలుదేరి వెళ్లాల్సిందే..
- మహిళా అభ్యర్థులకు తప్పని పాట్లు
- కేంద్రాలు మార్చాలని విన్నపం

కుల్కచర్ల: ప్రభుత్వ టీచర్ పోస్టు పొందాలనే తలంపుతో ఏళ్ల తరబడి పుస్తకాలతో కుస్తీ పడుతున్న నిరుద్యోగ యువతకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం డీఎస్సీ సిలబస్ ప్రత్యేకంగా ఉండటంతో పరీక్ష ప్రిపరేషన్‌కు సమయం లేక అదనంగా శ్రమిస్తున్నారు. అయితే హాల్ టికెట్‌లో వారికి కేటాయించిన పరీక్ష కేంద్రం చూసి అవాక్కు వుతున్నారు. దాదాపు 9గంటలు ప్రయాణిస్తే తప్ప కేంద్రాలు చేరుకోలేమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సుదూర ప్రాంతాల్లో..

డీఎస్సీ కోసం రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొంతమంది అభ్యర్థులకు ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి ప్రాంతాల్లో సెంటర్లను కేటాయించారు. కుల్కచర్ల మండలం నుంచి ఆదిలాబాద్‌లో కేటాయించిన పరీక్ష కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 400 కిలోమీటర్ల దూరం వెళ్లాలి. మహిళలు అంతదూరం ఎలా వెళ్లాలి? అనేది సమస్యగా మారింది. ఉదయం 9గంటలకే పరీక్ష ఉండడంతో సమయానికి చేరుకుంటామా లేదా అని ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో 500 మంది అభ్యర్థులుండగా వంద మందికి పైగా దూర ప్రాంతాల్లో సెంటర్లు పడడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. పలువురు మహిళలు పరీక్ష కేంద్రాలను మార్చాలని కోరుతున్నారు.

ఒక రోజు ముందే వెళ్లాలి



డీఎస్సీ పరీక్ష రాసేందుకు ఖమ్మంలో కేంద్రాన్ని కేటాయించారు. కుల్కచర్ల నుంచి ఖమ్మం వెళ్లాలంటే ఒకరోజు ముందే వెళ్లాలి. పరీక్ష రాసేందుకు మానసికంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. తెలియని ప్రాంతానికి వెళ్లి సమయానికి సెంటర్ చేరుకుంటామా లేదా అనే ఆందోళనగా ఉంది.

– స్రవంతి, డీఎస్సీ అభ్యర్థి, పీరంపల్లి

భార్యకు ఆదిలాబాద్.. భర్తకు మొయినాబాద్



పక్క ఫొటోలో కనిపిస్తున్న దంపతులిద్దరూ డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 19న నిర్వహించదలిచిన పరీక్షలో రాజేందర్‌కు మొయినాబాద్‌లో పరీక్ష కేంద్రం కేటాయించగా ఆయన భార్య అంజలి ఆదిలాబాద్ సెంటర్‌లో పరీక్ష రాయాల్సి ఉంది. ఇద్దరికీ ఒకే రోజు పరీక్ష ఉండడంతో 400 కిలో మీటర్లు పరీక్షకు ఎలా వెళ్లాలనే సందిగ్ధంలో పడ్డారు.



హైదరాబాద్‌లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ (మధ్యలో)

రైతుల త్యాగాలు ఆదర్శం

ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి

కందుకూరు: రైతుల త్యాగాలతోనే ఏ ప్రాజెక్టయినా ఏర్పాటు చేయడం సాధ్యమవుతుందని ధరణి కమిటీ సభ్యుడు ఎం.కోదండరెడ్డి అభిప్రాయపడ్డారు. కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ సూరజ్‌కుమార్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డితో కలిసి మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ సర్వే నంబర్లు 112 నుంచి 114, 118, 119 లలో భూమి ఉన్న రైతులతో భూసేకరణకు సంబంధించి సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వావిళ్లకుంటతండాకు చెందిన గిరిజన రైతులు తమ భూమి తండాకు పక్కనే ఉందని, ఆ భూములు ఇస్తే ఉపాధి కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రైతులు మాత్రం తమకు భూమికి బదులు భూమి ఇవ్వాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా రైతుల త్యాగం దేశానికే ఆదర్శవంతమైందన్నారు. ఈ ప్రాంతంలో ఫార్మాసిటీకి బదులు ఐటీ, మెడికల్, విద్య, ఉపాధికి సంబంధించిన సంస్థలను నెలకొల్పడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. పరిహారం విషయంలో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా సీఎం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు కేటాయించిన ప్లాట్లకు సంబంధించిన లేఅవుట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపాల్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, నాయకులు, రైతులు కృష్ణనాయక్, చిర్ర సాయిలు, రూప్లానాయక్, ఎ.సత్యనారాయణ, సత్యనారాయణరెడ్డి, కాకి నర్సింహ, హన్మంత్‌రెడ్డి, ఎస్.పాండు, శ్రీధర్ పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న అప్పాయిపల్లి రైతులు

పేదల భూములు లాక్కోవద్దు

ఆర్డీఓకు అప్పాయిపల్లి రైతుల వినతి

తాండూరు టౌన్: అభివృద్ధి పేరుతో పేదల భూములను లాక్కోవద్దని కొడంగల్ మండలం అప్పాయిపల్లి రైతులు కోరారు. మంగళవారం ఈ మేరకు తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మెడికల్ కళాశాల నిర్మాణానికి అప్పాయిపల్లి సర్వే నంబర్ 19లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల భూములను తీసుకోవడం సమంజసం కాదన్నారు. కొడంగల్ పరిధిలో అనేక ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని తీసుకోవాలని సూచించారు. అభివృద్ధికి తాము అడ్డు కాదని, తప్పనిసరి పరిస్థితుల్లో భూములు తీసుకోవాల్సి వస్తే తమ డిమాండ్ల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. కోరిన చోట భూమి లేదా రూ.50 లక్షల పరిహారం, ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం, 250 గజాల ఇంటి స్థలం, బాధితులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు కూలి పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, నాయకులు వెంకటయ్య, చంద్రయ్య, ఎరన్‌పల్లి శ్రీనివాస్, కె శ్రీనివాస్, బాలు, పకీరప్ప, మల్లేష్, బుగ్గప్ప, అమృతప్ప, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- స్పీకర్ ప్రసాద్‌కుమార్
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

బంట్వారం: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటికే ఆరు గ్యారంటీలను అమలు చేసే దిశగా ముందుకు సాగుతోందన్నారు. త్వరలోనే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి పథకం అమలు చేశామని గుర్తు చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, వెనుకబడిన బంట్వారం మండలానికి అవసరమైన నిధులు కేటాయిస్తానని చెప్పారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేస్తామని తెలిపారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన మేరక సొసైటీల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, మాజీ ఎంపీపీ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ సంతోష, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ అమలు చేస్తాం

మర్పల్లి: ఎన్నికల హామీ మేరకు ఆగస్టు 18వ తేదీ నాటికి రూ.2 లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేయనున్నట్లు స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గడప గడపకూ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో మర్పల్లి మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలోనే మండలంలోని ఘణాపూర్‌లో పారిశ్రామిక వాడ కోసం సర్వే చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కన పెట్టి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. ఒక వైపు అప్పులు కడుతూనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 50వేలకు పైగా నిరుద్యోగులు ఉన్నారని, ఘణపురంలో ప్రైవేటు పరిశ్రమ అందుబాటులోకి వస్తే వారికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, రవీందర్, ఖలీమొద్దీన్, సుభాష్‌యాదవ్, రామేశ్వర్, ప్రవీణ్‌రెడ్డి, అధికారులు గణేశ్, రాజమల్లయ్య, దశరథ్, మాధవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

వాయిదాల పర్వం

కొలిక్కిరాని సంజీవ స్వామి ఆలయ భూముల కౌలు వేలం

- ఇప్పటికే మూడు సార్లు వాయిదా
- ఈ నెల 26న నాలుగోసారి వేలం



దోమ: మండలంలోని దొంగ ఎన్కేపల్లిలో కొలువుదీరిన సంజీవస్వామి ఆలయ భూముల కౌలు వేలం వాయిదాల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే మూడు సార్లు వేలం పాటను వాయిదా వేశారు. ఒకసారి గతంలో కంటే తక్కువ పాట పాడారన్న కారణంగా.. రెండు సార్లు పెద్ద సంఖ్యలో రైతులు రాలేదన్న సాకుతో ఎండోమెంట్ అధికారులు వేలం నిర్వహించ లేదు. అయితే అధికారులు కావాలనే వేలం నిర్వహించడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

ఆలయానికి 104.19 ఎకరాల భూమి

సంజీవస్వామి ఆలయం పేరిట పరిగి నియోజకవర్గంలో 104 ఎకరాల 19 గుంటల భూమి ఉంది. గూడూరు గ్రామ పరిధిలోని 46 ఎకరాల 16 గుంటల భూమికి కౌలు వేలం నిర్వహించాలని భావించారు. రెండేళ్ల క్రితం పలువురు రైతులు రూ.9.44 లక్షలకు వేలం దక్కించుకున్నారు. కౌలు కాలపరిమితి ముగియడంతో గత నెల నుంచి వేలం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మూడు సార్లు కౌలు వేలం నిర్వహించగా ఎక్కువ మంది రైతులు రాలేదన్న సాకుతో అధికారులు వాయిదా వేస్తూ వస్తున్నారు. ఈ నెల 26న మళ్లీ వేలం నిర్వహించాలని నిర్ణయించారు.

ఆంతర్యం ఏమిటి?

ఆలయ భూముల కౌలు వేలం వాయిదా వేయడంలో అధికారుల ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 2, 8, 16వ తేదీల్లో కౌలు వేలం వేశారు. తాము పాల్గొన్నా ఎక్కువ మంది రాలేదన్న సాకుతో వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ నెల 2న దొంగ ఎన్కేపల్లి గ్రామ సర్వే నంబరు 135లో 10 ఎకరాల 35 గుంటల భూమికి గూడూర్ గ్రామానికి చెందిన బిచ్చయ్య అనే రైతు రూ.75 వేలకు వేలం పాడారు. అలాగే సర్వే నంబరు 66లో 14 ఎకరాల భూమిని కొత్తూరు రమేశ్ రూ. 1,50,000 వేలు, సర్వే నంబరు 173లో 20.15 గుంటలు, 174లో 38 గుంటల భూమిని ఏ నరేందర్ రెడ్డి అనే రైతు రూ. 60 వేలకు పాట పడినట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారులు వారికి అనుకూలమైన వ్యక్తులకు కౌలు భూములు వచ్చేలా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపించారు.

ఆసక్తి చూపని గత కౌలు రైతులు

గతంలో ఆలయ భూములను దక్కించుకున్న రైతులు ప్రస్తుతం జరుగుతున్న వేలం పాటలో పాల్గొనడం లేదు. గతంలో భూములు సాగు చేసిన రైతులు తాము నష్టపోయామని తెలిపారు. మరోసారి అదే కౌలుకు భూములు ఇస్తే సాగు చేసుకుంటామని అధికారులకు విన్నవించారు. అయితే రెండేళ్ల క్రితం కంటే ఎక్కువ పాట పడిన వారికే భూములు కేటాయిస్తామని అధికారులు చెప్పడంతో వారు ఆసక్తి చూపడం లేదు.



వేలంలో పాల్గొనేందుకు వచ్చిన రైతులు (ఫైల్)

వేలం నిర్వహించడం లేదు



సంజీవస్వామి ఆలయ భూముల కౌలు వేలం నిర్వహించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఇప్పటికే మూడు సార్లు వేలం నిర్వహించారు. ప్రతి సారీ ఎక్కువ మంది రైతులు లేరన్న సాకుతో వాయిదా వేస్తూ వస్తున్నారు. దీంతో వేలంలో పాల్గొనేందుకు వచ్చిన రైతులు వెనక్కు వెళ్లాల్సి వస్తోంది.

– పిల్లి సైదులు, కౌలు రైతు, దొంగ ఎన్కేపల్లి

అన్ని భూములకు వేలం వేస్తాం



ఆలయ భూముల కౌలుకు వేలం నిర్వహిస్తున్నాం. గతంలో కంటే ఒక్క రూపాయి ఎక్కువ పాడినా భూములను కౌలుకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ రైతులు ఎవరు ముందుకు రావడం లేదు. నాలుగోసారి ఫైనల్ అవుతుందని భావిస్తున్నాం. వచ్చే ఏడాది అన్ని భూములకు వేలం వేస్తాం.

– సుధాకర్, ఆలయ ఈఓ

ఆలయ భూముల వివరాలు

మండలం	గ్రామం	సర్వే నంబరు	విస్తీర్ణం
దోమ	దొంగ ఎన్కేపల్లి	38	3.2
"	దొంగ ఎన్కేపల్లి	9	2.33
"	గూడూర్	66,135,173,174	46.16
"	కిష్టాపూర్	167	0.38
"	బ్రాహ్మణపల్లి	103	1.31
పూడూరు	కేర్వెల్లి	110	1.33
"	చెన్‌గోముల్	311,312	4.29
"	మంచన్‌పల్లి	66	9.39
కుల్కచర్ల	అల్లాపూర్	57,58,67	9.08
పరిగి	పరిగి	383	9.18
"	కుదావంద్‌పూర్	108	4.20
"	హీరాపూర్	23	4.18
"	లఖ్నాపూర్	129	0.36
"	రావులపల్లి	36	4.28

న్యూస్‌రీల్

ఏకలవ్య పాఠశాల ఏర్పాటుకు కృషి చేయాలి



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గోవింద్ నాయక్

కుల్కచర్ల: జిల్లాలో ఏకలవ్య మోడల్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేయాలని గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్ కోరారు. మంగళవారం నగరంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కుల్కచర్ల, దోమ, బొంరాస్‌పేట ప్రాంతాల్లో గిరిజనులు అధికంగా ఉన్నారని ఈ ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. స్పందించిన ఎంపీ ఆ దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు గోవింద్ నాయక్ తెలిపారు.

మాతాశిశు ఆస్పత్రి వైద్యురాలికి మెమో జారీ

నవజాత శిశువు మృతిపై విచారణ



డాక్టర్ మంజుల నుంచి వివరాలు సేకరిస్తున్న ప్రదీప్ కుమార్

తాండూరు టౌన్: పట్టణంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నవజాత శిశువు మృతి చెందిన విషయమై డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రదీప్ కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. బొంరాస్‌పేట్ మండలం రేగడి మైలారానికి చెందిన కవిత ఆదివారం సాధారణ కాన్పు ద్వారా మగబిడ్డకు జన్మనిచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే శిశువు మృతికి కారణమని తల్లిదండ్రులు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ విషయమై ఆ రోజు విధుల్లో ఉన్న గైనకాలజిస్ట్ డాక్టర్ మంజులను చికిత్సపై ఆరా తీశారు. ఆమెకు మెమో జారీ చేసి, వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ.. శిశువు పుట్టిన వెంటనే శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడ్డాడని, వైద్యులు చికిత్స అందించినప్పటికీ మృతి చెందాడని తెలిపారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మూర్తి, ఆర్ఎంఓ అనిల్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

పూడూరు: ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ మంగళవారం డిమాండ్ చేశారు. రేషన్ కార్డు ఉన్న కుటుంబానికే రుణమాఫీ అనడం సరైంది కాదన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల దాటినా రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఏడు నెలలు కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కార్డుల ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు.

'మధ్యాహ్న భోజనం' అక్షయ పాత్రకు అప్పగించొద్దు



షాద్‌నగర్: మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు అప్పగించొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఫరూఖ్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు అక్షయపాత్ర వారు నాణ్యమైన భోజనం అందించడం లేదని, దీంతో విద్యార్థులు సరిగా తినక వృధాగా పడేయాల్సి వస్తుందని అన్నారు. నాణ్యమైన భోజనం అందించడం ఏజెన్సీల ద్వారానే సాధ్యమన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరారు. బిల్లులు సకాలంలో రాక వారు నగలు తాకట్టు పెట్టి నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు భోజనం అందించే బాధ్యతను అక్షయ పాత్రకు అప్పగిస్తే మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, శ్రీలత, సుమలత, హసీనా బేగం, రెహనాబేగం, ఖాజా బేగం, హీరు, రఘు ఉన్నారు.

క్లుప్తంగా

నిధుల మంజూరుకు వినతి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కోట్‌పల్లి నాయకులు

బంట్వారం: అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోట్‌పల్లి నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. మంగళవారం వారు నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటానంటూ సానుకూలంగా స్పందించారని వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు సంగయ్యస్వామి, సమ్మయ్య, సంతోష్ కుమార్, వెంకటేశ్, యాదయ్య, రాజశేఖర్, సమద్, బాల్‌రాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు ఉమారెడ్డి



పూజాకార్యక్రమానికి హాజరైన ఉమారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు ఉమారామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కాళ్లాపూర్‌లో ఉన్న లొంక ఆంజనేయస్వామి దేవాలయంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉమారామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు బదిలీ

ట్రాన్స్‌ఫర్ కోసం 11మంది జేపీఎస్‌లు దరఖాస్తు

తాండూరు రూరల్: తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న నలుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. అంతారం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఇస్మాయిల్ మల్కాపూర్ గ్రామానికి, మల్కాపూర్ క్యాదర్శి మోన్యానాయక్ యాలాల మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామానికి, వీరారెడ్డిపల్లి కార్యదర్శి కిష్టప్ప బండమీదిపల్లికి, బిజ్వార్ కార్యదర్శి ప్రవీణ వేరే జిల్లాకు బదిలీ అవుతున్నట్లు అధికారులు వెల్లడించారు. వీరితో పాటు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విశ్వనాథం, సత్యనారాయణరెడ్డి, కరుణారెడ్డి, శృతి, రవి, యాదగిరి, బాలరాజు, అశోక్, వెంకటప్ప, జయమ్మ, శివాణిరెడ్డి బదిలీకి దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. అంతారం పంచాయతీ కార్యదర్శిగా వీరప్ప, వీరారెడ్డిపల్లి కార్యదర్శిగా రవీందర్ ఈనెల 20 తర్వాత బాధ్యతలు స్వీకరిస్తారని చెప్పారు.

చిన్న జాతర షురూ



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

అనంతగిరి: అనంతగిరిగుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయ ఆషాఢ మాస చిన్నజాతర ఉత్సవాలు మంగళవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం ఎదుట ధ్వజస్తంభంపై కాషాయ ధ్వజారోహన చేసి ఉత్సవాలు ప్రారంభమయినట్లు ఆలయ ట్రస్టీ పద్మనాభం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి సుస్తీ!

మండల కేంద్రలోని ప్రభుత్వాస్పత్రి అధ్వానంగా మారింది. భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతోంది. వర్షాకాలం వచ్చిందంటే భవనం పైభాగంలో నీరు నిలవడం, కురుస్తుండడంతో ఉద్యోగులు, రోగులు ఇబ్బంది పడుతున్నారు. కురుస్తున్న ప్రదేశాల్లో చెత్తబుట్టలు, తట్టు సంచిలు పెడుతూ నెట్టుకొస్తున్నారు. వైద్యాధికారి రోహిత్‌ను వివరణ కోరగా విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని.. స్థానిక ఎమ్మెల్యే నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తున్నారని చెప్పారు.

– నవాబుపేట



కురుస్తున్న చోట పరిచిన గోనె సంచులు



డస్ట్‌బిన్‌లు, బకెట్ల ఏర్పాటు



పెచ్చులూడుతున్న పైకప్పు

రైల్వే బ్రిడ్జి నిర్మాణంపై అభ్యంతరం

- నచ్చజెప్పేందుకు యత్నించిన అధికారులు
- కౌన్సిలర్ల గొడవలతో అర్ధంతరంగా ముగిసిన సమావేశం



బ్రిడ్జి నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ శోభారాణి, బాధితులు

తాండూరు: పాత తాండూరు రైల్వే బ్రిడ్జి నిర్మాణంపై మంగళవారం నిర్వహించిన సమావేశం వివాదాస్పదంగా మారింది. రూ.74 కోట్ల నిధులతో చేపట్టిన రైల్వే వంతెన పనుల విషయంలో అభ్యంతరం వ్యక్తం చేస్తూ పాత తాండూరుకు చెందిన ఐదుగురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బ్రిడ్జి దాటిన తర్వాత పాత తాండూరులోకి వెళ్లేందుకు మూడు మార్గాలు ఉన్నాయని, ఇక్కడ వంతెన నిర్మిస్తే మిగిలిన రెండు వైపులకు వెళ్లే వారు ఇబ్బంది పడాల్సి వస్తుందని కౌన్సిలర్ శోభారాణి ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణంతో 125 కుటుంబాలు ఇళ్లు కోల్పోతారన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ గతంలో ఉన్న ప్రణాళికల ప్రకారం కాకుండా బ్రిడ్జి వెడల్పు కుదిస్తామని నచ్చచెప్పే ప్రయత్నం చేసినా బాధితులు అంగీకరించలేదు. బ్రిడ్జి నిర్మాణాన్ని ఆపేయాల్సిందేనని కొందరు నాయకులు డిమాండ్ చేశారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణంతో పట్టణ ప్రజకు ఎలాంటి ఉపయోగం లేకపోగా.. కాగ్నానది నుంచి అక్రమ ఇసుక రవాణ చేసే వారికి రాచమార్గంగా మారుతుందని పలువురు మండిపడ్డారు. దీంతో సమావేశం ఉద్రిక్తంగా మారింది. మరోవైపు పాత తాండూరు వెళ్లే మార్గంలో ఇరువైపులా వెళ్లేలా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని పలువురు కోరారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్ని అవాంతరాలు ఎదురైనా నిర్మాణ పనులు ఆపే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బొబ్బిలి శోభారాణి, బాంటినా, వరాల శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, సోమశేఖర్, మాజీ వైస్ చైర్మన్ అలీం, మాజీ కౌన్సిలర్ జుబేర్‌లాల, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, హబీబ్‌లాల తదితరులు ఉన్నారు.

పుట్టపహాడ్‌లో ఒకరికి డెంగీ



బాధితురాలి వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: మండల పరిధిలోని పుట్టపహాడ్‌లో ఒకరికి డెంగీ నిర్ధారణయింది. గ్రామానికి చెందిన గీతాంజలి అనారోగ్యంతో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోగా డెంగీ పాజిటివ్‌గా రిపోర్టు వచ్చింది. ఈ విషయాన్ని మహబూబ్‌నగర్ జిల్లా వైద్యాధికారులు కుల్కచర్ల ప్రాథమిక వైద్యశాలకు సమాచారం ఇచ్చారు. దీంతో మండల వైద్య బృందం గ్రామానికి వెళ్లి బాధితురాలి వివరాలు సేకరించారు. నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గ్రామంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె దవాఖాన వైద్యాధికారి మనీష్, మండల సబ్‌యూనిట్ అధికారి వెంకన్న మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రస్తుతం దోమలు, ఈగలు వ్యాపించే అవకాశం ఉన్నందున నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటయ్య, విజయలక్ష్మి, వెంకటమ్మ, రాధిక, రాజేశ్వరి, మంజుల పాల్గొన్నారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి



చెరువులో చంద్రమ్మ మృతదేహం

అనంతగిరి: కంటి చూపు, మానసిక స్థితి సరిగా లేని ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. ఈ ఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండలం గొంగుపల్లికి చెందిన జంగంగారి చంద్రమ్మ(65) ఈనెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో ఆమె కుమారులు నారాయణ, బందయ్యలు గాలిస్తుండగా మంగళవారం వికారాబాద్ పరిధిలోని శివారెడ్డిపేట చెరువులో మహిళ కనపడగా అటుగా వెళ్లిన నారాయణ ఒడ్డుపైనున్న సంచి, మెడపట్టిని చూసి తన తల్లిగా భావించి స్థానికుల సాయంతో ఒడ్డుకు తీసుకువచ్చి చంద్రమ్మ మృతదేహంగా నిర్ధారించుకున్నారు. మెడపట్టి, సంచి ఒడ్డున పెట్టి కాళ్లు చేతులు కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయి ఉండవచ్చునని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. తన తల్లి మృతిపై అనుమానం లేదని కుమారుడు ఫిర్యాదులో పేర్కొనట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

పంచాయతీని పట్టించుకోని కార్యదర్శులు



పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

సమస్యల్లో గ్రామాలు

- పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్తుల నిరసన

పెద్దేముల్: పంచాయతీ కార్యదర్శి విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన మండల పరిధిలోని గొట్లపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు పంచాయతీ కార్యలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలం.. సీజనల్ వ్యాధులు ప్రమాదమున్న నేపథ్యంలో గ్రామం అపరిశుభ్రంగా మారింది. వీధిలైట్లు లేవు. మురుగంతా రోడ్లపైనే ప్రవహిస్తుంది. దీంతో దోమలు విపరీతంగా పెరగడంతో అనారోగ్యం పాలవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజు నెల రోజులగా గ్రామ సందర్శనకే రాలేదంటూ ఆరోపిస్తున్నారు. కనీసం మండల స్థాయి అధికారులు గ్రామాలకు వచ్చి పరిశీలించకపోవడంతో పట్టించుకునే వారే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఎంపీడీఓ జర్నప్ప వారంలో ఒక రోజుకూడా గ్రామానికి రాలేదని.. గతంతో లక్ష్మప్ప మూడు రోజులకు తగ్గకుండా గ్రామ పర్యటనకు వచ్చేవారని గుర్తు చేశారు. ఆందోళన చేపట్టిన వారిలో చంద్రప్ప, రఫీక్, ఇస్మాయిల్, ఇర్ఫాన్, బంటు రాములు, మల్లప్ప, సారలాలప్ప, సార వెంకటప్ప తదితరులున్నారు. ఇదే విషయమై ఇన్‌చార్జి ఎంపీఓ రమేశ్‌ను వివరణ కోరగా.. గొట్లపల్లి కార్యదర్శి రాజు అనారోగ్యంతో సెలవులో ఉన్నారని.. ప్రస్తుతం ఆత్కూర్ కార్యదర్శి అర్చనకు ఇన్‌చార్జిగా కేటాయించామన్నారు. గ్రామస్తులను విచారించి చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఎంపీఓ వెల్లడించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి



పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ నిర్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

దోమ: పరిశ్రమలను విస్తరించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని మాజీ వైస్ ఎంపీపీ బంగ్ల యాదయ్యగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన రాష్ట్ర పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ నిర్మలను నగరంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఆవు దూడల పట్టివేత

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న ఆవు దూడలను యాచారం పోలీసులు పట్టివేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సోమవారం అర్ధరాత్రి ఓ ప్రైవేట్ వాహనంలో తొమ్మిది ఆవు దూడలను తుక్కుగూడకు తరలిస్తుండగా గునుగల్ గేట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, పట్టుకున్న ఆవు దూడలను నగరంలోని గోశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రంగారెడ్డి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న రంగారెడ్డి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

కందుకూరు: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నేదునూరు, బాచుపల్లి గ్రామాల్లో మంగళవారం ఆమె స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా నేరవేరుస్తోందని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు అమలు చేస్తున్నారని చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీ పూర్తిగా చేయకుండా మోసం చేసిందన్నారు. గడీల పాలన పోయి ప్రజాపాలన జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. డ్వాక్రా మహిళలతో మాట్లాడి రుణాలు తీసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, కృష్ణ, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టమాటా.. అన్నదాతతో ఆట

చెట్టుపైనే మురుగుతున్న కాత

- చేతికి వచ్చిన పంట పాడవుతోందని రైతుల ఆందోళన



వర్షాలకు పాడైన టమాటాను చూపుతున్న రైతు

పెద్దేముల్: కూరగాయ సాగులో అగ్రస్థానంలో ఉండే టమాటా అన్నదాతతో ఆటాడుతుంది. ఏడాది పొడవునా సాగు చేస్తున్న వారికి మార్కెట్ లేదని కొన్నిసార్లు పంటను పొలంలోనే దున్నేస్తున్నాడు. ధర అనుకూలంగా ఉండడంతో మండల పరిధిలోని పెద్దేముల్, నాగులపల్లి, రుద్రారం, హన్మాపూర్, గిర్మాపూర్, జైరాంతండా, బుద్దారం, గాజీపూర్, గొట్లపల్లి, తట్టెపల్లితో పాటు పలు గ్రామాలల్లో రైతులు సుమారు వంద ఎకరాలకు పైగా కూరగాయలు సాగు చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో చీడపురుగులు, రోగాలు సోకడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. పెద్దేముల్ గ్రామానికి చెందిన ముజీఫ్ నాలుగు ఎకరాల్లో టమాట పంట సాగు చేశాడు. మొదటి ఎకరాలో తక్కువ ధరకు విక్రయించినా.. రెండో ఎకరంలో రూ.2లక్షల వరకు పంట విక్రయించాడు. దీంతో మరో మూడు ఎకరాల్లో టమాటా సాగుకు చేశాడు. కొత్త పంట మాత్రం చేతికి రాకముందే కాత మురిగిపోతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట మరింత పాడవుతోంది. దీంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. రైతులకు సలహాలు, సూచనలిచ్చేందుకు అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ తీరుతో నిరుద్యోగులకు ఇబ్బందులు



ఎమ్మెల్యే సబితారెడ్డితో షాబాద్ బీఆర్ఎస్ నాయకులు

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

షాబాద్: కొంత మంది పార్టీ మారినంత మాత్రాన ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో లక్షలాది మంది కార్యకర్తలు పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె బీఆర్ఎస్ పార్టీ షాబాద్ మండల నాయకులకు చెప్పారు. నగరంలోని ఆమె నివాసంలో మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సబితారెడ్డి, కార్తీక్‌రెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలో ప్రజలు, నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసే వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. చేవెళ్ల ప్రాంత ప్రజలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. ఆమెను కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, చాంద్‌పాషా, యాదయ్య, దర్శన్, మల్లేష్, శేఖర్, కృష్ణగౌడ్, భూపాల్‌రెడ్డి, రాజుగౌడ్, అవిలాష్‌గౌడ్, గోపాల్, రామస్వామి, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

విస్తరణ.. జరిగేనా?

ఎన్‌హెచ్ 765గా హైదరాబాద్–శ్రీశైలం రోడ్డు

- 2013లో జాతీయ రహదారిగా గుర్తింపు
- రెండు లేన్ల రోడ్డుతో వాహనదారుల పాట్లు
- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- విస్తరణ కోసం ఏళ్లుగా ఎదురుచూపులు



ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి

ఆమనగల్లు: హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై నిత్యం రద్దీతో ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. విస్తరణ కోసం కొన్నేళ్లుగా వాహనదారులు, ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రహదారిని విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రాన్ని అభ్యర్థించింది. నాలుగులేన్లుగా విస్తరించడానికి కేంద్రం రెండేళ్ల క్రితం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ నేటికీ నిధులు మాత్రం విడుదల కాలేదు. రెండు లేన్లతో సరి హైదరాబాద్–శ్రీశైలం రహదారిని 2013లో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి 765గా గుర్తించింది. హైదరాబాద్–శ్రీశైలం మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని తోకపల్లి వరకు జాతీయ రహదారిగా గుర్తించి రెండు లేన్ల రోడ్డుగా నిర్మించారు. తెలంగాణలోని రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో 194 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 79 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టారు. దాదాపు రూ.230 కోట్లతో రెండు లేన్ల రోడ్డును చేపట్టారు. అయితే అప్పట్లో రెండు లేన్లకు బదులు నాలుగులేన్ల రోడ్డును నిర్మించాలని కోరినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. అప్పటి వాహనాల రద్దీకి అనుగుణంగా రెండు లేన్లు నిర్మించి కడ్తాల్ సమీపంలో హాజీపూర్ వద్ద రెండు టోల్‌గేట్లు ఏర్పాటు చేశారు.

పెరిగిన వాహనాల రద్దీ

ఈ రహదారిపై వాహనాల రద్దీ రోజురోజుకూ పెరిగిపోతోంది. నిత్యం వేలాది వాహనాలు, లక్షలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతిరోజు దాదాపు 8 వేల వాహనాల రోడ్డుపై ప్రయాణిస్తున్నాయి. శని, ఆదివారాలు రద్దీ మరింత పెరిగిపోతుంది. పెరిగిన రద్దీకి అనుగుణంగా రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఉంది.

చర్యలు కరువు

హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో ప్రయాణికులు మృత్యువాత పడుతుండగా మరెందరో క్షతగాత్రులుగా మారుతున్నారు. పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డు లేకపోవడంతో పాటు మధ్యలో డివైడర్ లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పదేపదే ప్రమాదాలు జరుగుతున్నా నివారణకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు

అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిని విస్తరించాలని కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు గతంలో జాతీయ రహదారుల శాఖామంత్రి నితిన్‌గడ్కరీని కలిసి ప్రతిపాదనలు అందించారు. ఇప్పటికైనా వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని జాతీయ రహదారిని విస్తరించాలని పలువురు కోరుతున్నారు.

నాలుగు లేన్లకు విజ్ఞప్తి

జాతీయ రహదారికి అనుసంధానంగా కేంద్ర ప్రభుత్వం కల్వకుర్తి సమీపంలోని కొట్ర గేటు నుంచి కొల్లాపూర్‌లోని సోమశిల మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల వరకు నూతనంగా నిర్మించే జాతీయ రహదారిని 167కెగా గుర్తించారు. కొత్తగా నిర్మించే జాతీయ రహదారితో హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే వాహనాలకు దాదాపు 90 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. నూతనంగా నిర్మించే జాతీయ రహదారికి హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి అనుసంధానంగా ఉండటంతో హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వరకు నాలుగులేన్ల రోడ్డు నిర్మించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.